విజ్ఞానం పెంచుకుందాం రండి!

- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ
- జూన్ 11 వరకూ కొనసాగనున్న శిక్షణ
- ఉమ్మడి జిల్లాలో 2 వేల మంది విద్యార్థులకు శిక్షణ



ఉప్పాడలో ఉన్న గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొత్తపల్లి: చిన్నారులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వేసవి సెలవుల సమయం వృథా కాకూడదని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసింది. ఆట పాటలతో శిక్షణ తరగతులు నిర్వహించి పిల్లల్లో మానసిక వికాసం పెంచుతోంది. ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాలోని 101 గ్రంథాలయాల్లో వేసవి తరగతులు ప్రారంభమయ్యాయి. సుమారు 2వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. కాకినాడ జిల్లాలోని 34 గ్రంథాలయాల్లో 900 మంది క్లాసులకు వెళుతున్నారు. ఈ శిక్షణ వచ్చే నెల 11వ తేదీ వరకూ వివిధ అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు.

సృజనాత్మకత వెలికి తీసేలా..

చిన్నారుల్లోని సృజనాత్మకత వెలికి తీసేలా గ్రంథాలయ శాఖ ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నారు. పుస్తక పఠనం వైపు మళ్లించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయి. వారిని విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, భావ వ్యక్తీకరణ, ఆంగ్ల భాషపై పట్టుసాధించేలా తీర్చిదిద్దుతున్నారు. పుస్తక పఠనం, చదరంగంతోపాటు వినోదం, విజ్ఞానం, కలబోతగా పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఆకట్టుకునేలా కథలు చెప్పడం, నీతి కథలను మానవీయం, ప్రవర్తన, భావ వ్యక్తీకరణ వంటి అంశాలపై శిక్షకులు తర్ఫీదు ఇస్తున్నారు. మండలంలోని రెండు గ్రంథాలయాల్లో దాతల సహకారంతో విరామ సమయంలో విద్యార్థులకు బిస్కెట్లు, మజ్జిగను అందిస్తున్నారు. ఆసక్తి ఉన్న 5 నుంచి 16 ఏళ్ల చిన్నారులు ఈ శిక్షణకు హాజరుకావచ్చు.

రోజువారీ ప్రణాళిక ఇలా

- ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదివించడం.
- 10 గంటల నుంచి 10.10 గంటలకు వరకూ విరామం.
- 10.10 గంటల నుంచి 11 గంటల వరకూ కథలు చెప్పడం
- 11 గంటల నుంచి 12 గంటల వరకూ స్పోకింగ్ ఇంగ్లిష్, హిందీ, డ్రాయింగ్, పెయింటింగ్, సంగీతం, యోగా, ధ్యానం నేర్పించడం.

చిత్రలేఖనంపై ఆసక్తి



చిత్రలేఖనం అంటే ఇష్టం. ఖాళీ సమయాల్లో చిత్రలేఖనం వేస్తుంటాను. గ్రంథాలయంలో మరిన్ని మెళకువలు నేర్పిస్తున్నారు. వేసవి సెలవులను ఇలా ఉపయోగించుకుంటూ కొత్త అంశాలను నేర్చుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది. హిందీపై మరింత పట్టు సాధిస్తున్నాను.
–ఎస్.మౌనిక, 8వ తరగతి, ఉప్పాడ

కొత్త విషయాలు నేర్చుకుంటున్నా



ఈ వేసవిలో కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను. ముఖ్యంగా స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ పొందుతున్నా. పుస్తకాలు చదవడం వల్ల ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి. శిక్షణ ఎంతో బాగుంది.
–ఎస్.విజయ్, 5తరగతి ఉప్పాడ

పిల్లల్లో ఆసక్తి



ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి వచ్చేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం రెట్టింపు మంది శిక్షణ పొందుతున్నారు. గ్రంథాలయానికి 40 మంది వస్తున్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా అందజేస్తాం.
–టి.నళినీ ప్రియ, ఉప్పాడ గ్రంథాలయ అధికారి

పిల్లలను ప్రోత్సహించాలి



విద్యార్థుల్లో పఠనాసక్తి, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఉపయోగపడతాయి. వాటిలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో ఉపయోగకరం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 101 గ్రంథాలయాల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నాం. సుమారు వేల మంది విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు. నిపుణులైన శిక్షకులతో పిల్లలకు తర్ఫీదు ఇస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలను ప్రోతహించి, పంపించాలి. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.
–వి.సాయిప్రసాద్, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

అన్నవరం షోకేస్ హుండీ రాబడి రూ.36 వేలు



సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫాంపై హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట: అన్నవరం దేవస్థానం సత్యనారాయణస్వామికి చెందిన షోకేస్ హుండీ ద్వారా రూ.36,767 ఆదాయం వచ్చినట్టు స్థానిక పంచారామ క్షేత్ర ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక రైల్వే ప్లాట్‌ఫాంపై అన్నవరం దేవస్థానం వారు షోకేస్ హుండీని ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫాంలపైకి వచ్చిన భక్తులు మొక్కులు, కానుకలు చెల్లించుకునేందుకు ఇది ఏర్పాటు చేశారు. మంగళవారం అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో హుండీని తెరచి కానుకలు లెక్కించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నేతల హరిబాబు, పితాని కృష్ణ, అన్నవరం దేవస్థాన సూపరింటెండెంట్ ఏవీఎస్ ప్రసాద్, అన్నవరం దేవస్థాన క్యాసిర్ ఎం.నాగేశ్వరరావు, పంచారామ క్షేత్రం సూపర్‌వైజరు ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పాలనపై అవగాహన పెంచుకోవాలి



మాస్టర్ ట్రైనీలకు సర్టిఫికెట్లు అందజేసిన వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

సామర్లకోట: గ్రామ పరిపాలనపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తి స్థాయిలో అవగాహన పెరిగేలా మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇవ్వాలని విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతామరారాజు, కాకినాడ జిల్లాలోని మాస్టర్ ట్రైనీలకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను రక్షించడంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధుల ఖర్చు చేసే విషయంలో అవగాహన పెంచాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే విధంగా పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని వివరించాలన్నారు. ఈటీసీ రిసోర్సు పరన్లు పి.శ్రీనివాసరావు, కెఎస్ఆర్ నిహారిక, ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మాస్టర్ ట్రైనీలకు సర్టిఫికేట్లు అందజేశారు.

విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస



అర్చనను, తలాటం వెంకటలక్ష్మిని అభినందించిన జిల్లా కలెక్టర్

సామర్లకోట: ఇటీవలి పదో తరగతి పరీక్షల్లో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 582 మార్కులు సాధించిన తలాటం లక్ష్మిని కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం అభినందించారు. విద్యాశాఖ ఆర్‌జెడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.
పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 571 మార్కులకు మించి వచ్చిన విద్యార్థులను కలెక్టరు కృతికా శుక్లా మంగళవారం కాకినాడ పీఆర్‌జి బాలుర ఉన్నత పాఠశాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ మేరకు నవర జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో 580 మార్కులు సాధించిన సన్నిబోయిన అర్చనను ఆమె తల్లిదండ్రులు నాగలక్ష్మి, నాగశైనలను కలెక్టర్ శుక్లా అభినందించారు.

మానవ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



శస్త్ర చికిత్సకు ఎంపికైన పది మందితో బీహెచ్ఆర్‌సీ బృందం

పెద్దాపురం: భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ అధ్యక్షుడు ఆర్.విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఆశీర్వాదం అన్నారు. మండలంలోని కాండ్రకోట మహిమ గల దేవుని మందిరం బాపిస్టు చర్చిలో మంగళవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బీహెచ్ఆర్‌సీ, సీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ అమృత్‌లాల్ వైద్య సేవలందించారు. సుమారు వంద మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా పది మందికి శస్త్ర చికిత్స నిమిత్తం తరలించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్రావు, ఆర్.జయరాజ్, సుందర్‌కుమార్, సీహెచ్.వర్మ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ కృతికా శుక్లా
- 'ఉమా' సొసైటీపై సమీక్ష

కాకినాడ సిటీ: ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహిస్తున్న జిల్లా పునరావాస నిర్వహణ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ కృతికా శుక్లా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ సొసైటీ గత ఏడాది కార్యక్రమాలను సమీక్షించి, 2023–24 ఏడాది ప్రణాళికను రూపొందించి జిల్లా అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల హక్కులపై అవగాహనలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకులు వి కామరాజు మాట్లాడుతూ దివ్యాంగుల పునరావాసానికి అవసరమైన సేవలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ సహకరిస్తామన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి మాట్లాడుతూ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీఎంహెచ్‌ఓ ఆర్.రమేష్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.ప్రవీణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ హేమలత, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రంగలక్ష్మీదేవి, ఉమామనోవికాస కేంద్రం పీడీ కె.నారాయణరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లాడి శివరాం వర్ధంతి



మల్లాడి శివరాం నాయకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో దివంగత మల్లాడి శివరాం నాయకర్ రెండో వర్ధంతి నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమల కుమారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 'మహా దాత మల్లాడి సత్య లింగ నాయకర్' ఆశయాలను పుణికిపుచ్చుకున్న వంశపారంపర్య ధర్మకర్త, ఎంఎస్ఎన్ చారిటీ చైర్మన్ వ్యవహరించిన మల్లాడి శివరాం నాయకర్ ఎంతో ఉన్నతమైన వ్యక్తి అని, వారి పూర్వీకులు ఏ ఆశయంతో విద్యాలయాల అభివృధికి స్థలాలను కేటాయించారో వాటిని జాగ్రత్తపరుస్తూ వారి కృషిని కొనసాగించారన్నారు. ఆయన పేరు మీదుగా వర్సిటీ ఉన్నతాధికారుల సెమినార్ హాల్‌కు నామకరణం చేయడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిబాబు, వాసంసెట్టి శ్రీనివాస్, ప్రమీల, రాజ్ కుమార్, చైతన్య, రామకృష్ణ తదితర బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి విడతగా 22,818 పాఠ్య పుస్తకాల రాక

కరప: మండలానికి 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటివిడతగా 22,818 పాఠ్యపుస్తకాలు వచ్చినట్టు సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి (ఏఎంఓ) ఎంవీ రామారెడ్డి, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి తెలిపారు. జగనన్న విద్యాకానుక మండల స్టాక్‌పాయింట్ స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నతపాఠశాలకు పాఠ్యపుస్తకాలు రాగా, వాటిని భద్రపరచినట్టు తెలిపారు. వేసవి సెలవులు ముగిశాక పాఠ్యపుస్తకాలను అందజేయనున్నట్టు ఎంఈఓ తెలిపారు.

సమగ్రంగా అసెస్మెంట్ల సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్ కుమార్

కాకినాడ: నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నివాసాలు, కుటుంబాలు, వ్యాపార సంస్థల సమాచారంతో సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. 15 రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం ఈ అంశంపై ప్రత్యేక, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అసెస్మెంట్‌ల వారీగా యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారా అని తెలుసుకోవాలని తెలిపారు.

ఏడీసీ నాగ నాగ నరసింహారావు మాట్లాడుతూ సర్వే ప్రక్రియను నోడల్ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని, సర్వేకు ఆయా సచివాలయాల అడ్మిన్లు, వలంటీర్లు, ఇతర సిబ్బంది సంపూర్ణంగా సహకరించాలని స్పష్టం చేశారు. జీఎస్‌డబ్ల్యూఎస్ డేటాకు, అసెస్మెంట్‌లకు, యూజర్ చార్జీలు చెల్లిస్తున్న వారికి మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తున్న నేపథ్యంలో ఈ సర్వేతో ప్రయోజనం ఉంటుందన్నారు. అలాగే వ్యాపార సంస్థలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ ఉందో లేదో పరిశీలించాలన్నారు.

నిర్ణీత ప్రొఫార్మా ప్రకారం సర్వేను పూర్తి చేయాలని సూచించారు.
పారదర్శకంగా సర్వే చేస్తే నమోదు కాని అసెస్మెంట్‌లు, ట్రేడ్ లైసెన్సులు తీసుకోని వ్యాపార సంస్థలు, యూజర్ చార్జీలు చెల్లించని కుటుంబాల సమాచారం బయటపడుతుందన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, శానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గాదేవి ప్రతిష్ఠోత్సవం

కరప: స్థానిక హైస్కూల్ సెంటర్‌వద్ద దుర్గాదేవి ఆలయంలో బుధవారం కనకదుర్గ అమ్మవారి 35వ ప్రతిష్టా వార్షికోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమీటీ తెలిపింది. గ్రామంలో పాడిపంటలు వృద్ధిచెంది, ప్రజలు సుఖశాంతులతో ఉండేందుకు దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించినట్టు వారు తెలిపారు. 10వ తేదీన ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి, ప్రసాదవితరణ జరుగుతుందని కమీటీ సభ్యులు తెలిపారు. కరప పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. బుధవారం హైస్కూలు ఆవరణలో మహాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్టు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

17 లోపు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

సామర్లకోట: పదో తరగతి పరీక్షలు ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు ఈనెల 17వ తేదీ లోపుగా ఫీజు చెల్లించాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మూడు సబ్జెక్టుల వరకూ రూ.110, మూడు సబ్జెక్టులు దాటితే రూ.125 ఫీజు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసంతో ఈనెల 22వ తేదీ వరకూ ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు.

పుస్తక పఠనంతో మరింత విజ్ఞానం



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

పెద్దాపురం: పుస్తక పఠనంతో విద్యార్థులకు మరింత పరిజ్ఞానం లభిస్తుందని సమ్మర్ క్యాంపు ఉపాధ్యాయిని వాడపల్లి విమలారాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం స్పోకెన్ ఇంగ్లిష్, పుస్తక పఠనం నేర్పించారు. రెండో రోజు శిక్షణ తరగతులకు సుమారు 30 మంది చిన్నారులు హాజరయ్యారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను, సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తప్పుడు ఆరోపణలు తగదు

సామర్లకోట: ప్రతి పక్ష నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకొవాలని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా నాలుగు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ అవుతోందన్నారు. ఈ మేరకు జి.మేడపాడు గ్రామంలో గత నెల 19 నుంచి ఈనెల 9వ తేదీ వరకు 153 మంది రైతుల నుంచి 14,484 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. దీనిలో సన్నాలు ఇప్పటి వరకు 2,399.60 క్వింటాళ్లు, బొండాలు 12,084.40క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందన్నారు.

రైల్వే గేటు మూసివేత

మరమ్మతులు ప్రారంభం



ఉప్పాడ రైల్వే గేటు వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: గ్రామంలోని ఉప్పాడ రైల్వే గేటును మూడు రోజుల పాటు మూసివేయనున్నట్టు అధికారులు తెలిపారు. మంగళవారం ట్రాక్ మరమ్మతు పనులను సిబ్బంది ప్రారంభించారు. విద్యుత్, ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 9వ తేదీ నుంచి 11 సాయంత్రం 5 గంటల వరకూ గేటు మూసివేయనున్నట్లు వారు తెలిపారు. ఈ దారిలో వెళ్లే వాహనాలను మాధవపురం, గోర్స రైల్వే అండర్ బ్రిడ్జిల మీదుగా మళ్లించినట్టు తెలిపారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని వారు కోరారు.

12న బాస్కెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం: ఈనెల 12వ తేదీన రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ పాలకొల్లు సమీపంలో ఉల్లంకుర్రులో నిర్వహించనున్న రాష్ట్ర యూత్ బాలబాలికల బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ ఎంపిక ఉదయం 7 గంటల నుంచి జరుగుతుందన్నారు. ఈ ఎంపికకు వచ్చే క్రీడాకారులు జనవరి ఒకటి 2007 తరువాత పుట్టిన వారై ఉండాలని రిజనల్ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన సూచించారు.

రోడ్లపై మురుగు నీటితో రాకపోకలకు ఇబ్బంది



రోడ్లపై నిలిచిపోయిన మురుగు నీరు

పిఠాపురం: పట్టణం చిట్టోడితోట ప్రాంతంలో మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా మురుగునీరు రోడ్లపై ఉండిపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వీధిలోకి రావడానికి కూడా వీలు లేకుండా పోయిందని, మురుగు వల్ల అనారోగ్యాల పాలవుతున్నామని వాపోతున్నారు. కనీసం వీధిలోకి రావడానికి కూడా వీలు లేకుండా ఉందని వెంటనే మురుగు నీరు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీలను బలోపేతం చేయాలి

మెప్మా పీడీ ప్రియంవద



శిక్షణలో మాట్లాడుతున్న పీడీ ప్రియంవద

సామర్లకోట: రిసోర్సుపర్సన్లు, ఆర్పీలు మున్సిపాలిటీల పరిధిలోని మహిళా సంఘాలను బలోపేతం చేయాలని మెప్మా పీడీ ప్రియంవద పిలుపు నిచ్చారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ జిల్లాలో రిసోర్సు పర్సన్లకు రెండు రోజుల శిక్షణను ఆమె ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలు, మెప్మా కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. కాకినాడ జిల్లాతో పాటు కోనసీమ జిల్లాలో మున్సిపాలిటీలకు చెందిన ఆర్పీలకు 16 బ్యాచ్‌లలో శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్సు పర్సన్ ఎల్.జయరామ్, బ్యాంకు లింకేజ్ డీపీఎం రామలక్ష్మి, ఐబీ డీపీఎం కె.మోహన్‌కుమార్ శిక్షణ ఇచ్చారు.

రైల్వే ప్లాట్‌ఫారాలకు విద్యుత్ సొబగులు



కొత్త లైట్ల వెలుతురులో సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫారం

సామర్లకోట: స్థానిక రైల్వే ప్లాట్‌ఫాంకు విద్యుత్ సొబగులు సంతరించుకున్నాయి. రైల్వే స్టేషన్ పరిధిలోని మూడు ప్లాట్‌ఫారాలకు విజయవాడ రైల్వే డివిజనల్ ఇంజినీరింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఈ దీపాలు అమర్చారు. స్టేషన్ మేనేజరు ఎం రమేష్, ఏడీఈఎన్ బి.శివప్రసాద్‌లు ఈ దీపాలను ప్రారంభించారు. పీడబ్ల్యూఐలు త్రినాథ్ కాశీ, రామ సుబ్బారావు, సిగ్నల్ ఇన్‌స్పెక్టరు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



హెల్మెట్ ధారణపై అవగాహన ప్రదర్శన చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

కాకినాడ క్రైం: కాకినాడ ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధారణపై చోదకులకు అవగాహన కల్పించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ప్లకార్డులు ప్రదర్శించి హెల్మెట్ ప్రాధాన్యాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించే వేళ హెల్మెట్ ధరించి ప్రాణాలు నిలుపుకున్న పలువురు చోదకుల ఉదంతాలను ప్రస్తావించారు. సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొని అవగాహన ప్రదర్శన చేపట్టారు.

వైభవంగా జలాధివాసం



స్వామి వారి జలాధివాసం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణస్వామి ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్ల జలాధివాసం నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో రుత్వికులు, భక్తులు దాతలు ఆధ్వర్యంలో ఉదయం భగవదారాధన, బాలభోగ మంగళాశాసనములు, విన్నపాలు తదితర ప్రక్రియలు నిర్వహించారు. అనంతరం జలాధివాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.